# సాక్షి ఖమ్మం

సోమవారం ¦ 6 ¦ నవంబర్ ¦ 2023






**పైసలు పట్టుకెళ్లాలంటే గోసే**

ఎన్నికల వేళ పోలీసుల తనిఖీలతో సాధారణ ప్రజలు రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లాలంటే బెంబేలెత్తిపోతున్నారు. 10లో



**ఒకేదఫా రుణమాఫీ**

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ఒకేదఫా చేస్తామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తెలిపారు. 10లో

గరిష్టం / కనిష్టం
31° / 24°

**వాతావరణం**

సోమవారం తెల్లవారుజామున, రాత్రి చలి ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

## న్యూస్‌రీల్

### నేడు స్విమ్మింగ్ ఎంపిక పోటీలు

కొత్తగూడెంటౌన్‌: ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి అండర్‌–14, 17 బాలబాలికల స్విమ్మింగ్ ఎంపిక పోటీలు సోమవారం నిర్వహించనున్నారు. కొత్తగూడెంలోని సీఈఆర్ క్లబ్‌లో పోటీలు జరుగుతాయని భద్రాద్రి డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఉదయం 9గంటలకు హాజరు కావాలని సూచించారు. క్రీడాకారులు స్టడీ సర్టిఫికేట్, ఆధార్‌కార్డు తదితర సర్టిఫికెట్లతో రావాలని తెలిపారు. వివరాల కోసం జిల్లా పాఠశాలల క్రీడా కార్యదర్శులు కె.నర్సింహామూర్తి, స్టెల్లా ప్రేమ్‌కుమార్‌ను సంప్రదించాలని సూచించారు.

### రామయ్యకు పుష్యమి పట్టాభిషేకం

రామాలయంలో భక్తుల సందడి



నిత్యకల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ఆదివారం పుష్యమి నక్షత్రం సందర్భంగా పట్టాభిషేకం వేడుకను వైభవంగా నిర్వహించారు. అంతకుముందు అంతరాలయంలో మూలమూర్తులకు అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, ఆదివారం సెలవు కావడంతో రామాలయంలో భక్తుల సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి దర్శనానికి బారులుదీరారు. స్వామి వారి అర్జిత సేవలతో పాటు నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తుల సందడి

పాల్వంచ : మండలంలోని శ్రీకనకదుర్గమ్మ (పెద్దమ్మగుడి) ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. బోనాలు సమర్పించడంతో పాటు అన్నప్రాశన, తలనీలాలు, అమ్మవారికి ఒడిబియ్యం, చీరలు, పసుపు, కుంకుమ సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా భక్తులకు ఉచిత పులిహోర ప్రసాద వితరణ, మంచినీటి వసతి కల్పించారు. కొల్లు ప్రభాకర్ రెడ్డి, గోవిందమ్మ దంపతులు రూ.10,011 నగదును విరాళంగా సమర్పించారు. కార్యక్రమంలో ఈఓ ఎస్.రజనీకుమారి, ధర్మకర్తల మండలి అధ్యక్షులు మహిపతి రామలింగం, సందుపట్ల శ్రీనివాస్ రెడ్డి, చింతా నాగరాజు, గంధం వెంగళరావు, సంకా వెంకట రామారావు పాల్గొన్నారు.

# పువ్వు కావాలా.. ముల్లా?!



సభకు హాజరైన వారికి నమస్కరిస్తున్న సీఎం కేసీఆర్, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



వేదికపై ఎంపీ నామా నాగేశ్వరరావు, పాలేరు, సత్తుపల్లి, వైరా అభ్యర్థులు ఉపేందర్‌రెడ్డి, వెంకటవీరయ్య, మదన్‌లాల్‌తో పాటు బానోతు చంద్రావతి, కొత్తూరు ఉమామహేశ్వరరావు తదితరులు

**పువ్వాడ పువ్వుల్లో పెట్టి చూసుకుంటడు..**

- తుమ్మల తుప్పలను గెలిపిస్తే గుచ్చుకునేది ముల్లే
- ప్రభుత్వ విజన్.. అజయ్ మిషన్‌తో ఖమ్మానికి అందం
- ఖమ్మం ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్
- నాకే మంత్రి పదవి ఇప్పించానన్న ఆయన చరిత్ర మీ కళ్లముందుంది
- ఖమ్మం జిల్లాకు జిల్లానే గుత్త పట్టిండా.. కొనేసిండా?
- మాజీ మంత్రి తుమ్మల, మాజీ ఎంపీ పొంగులేటిపై విమర్శలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'మంచి చెడు ఆలోచించి ఓటు వేస్తే మంచి జరుగుతది. పువ్వాడ అజయ్‌ను గెలిపిస్తే మిమ్మల్ని పువ్వుల్లో పెట్టి చూసుకుంటడు. అదే తుమ్మల తుప్పలను తెచ్చుకుంటే ముల్లు గుచ్చుకుంటది. తుమ్మ ముల్లు కావాల్నా.. పువ్వాడ పూలు కావాల్నా.. తేల్చాల్సింది ఖమ్మం ప్రజలే. ప్రభుత్వానికి ఉన్న విజన్, అజయ్ మిషన్ తోడైతే ఖమ్మం నేడు ఎట్ల ఉందో మీ కళ్ల ముందుంది. వీటన్నింటినీ విచారించి.. ఆలోచించి మీ అమూల్యమైన ఓటును అజయ్‌కుమార్ కారు గుర్తుపై వేసి గెలిపించాలి.' అని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో రాష్ట్ర మంత్రి, బీఆర్ఎస్ ఖమ్మం అభ్యర్థి పువ్వాడ అజయ్ అధ్వర్యాన ఆదివారం ఏర్పాటుచేసిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొన్నారు. జిల్లా కేంద్రం కావడంతో నేతల కృషి ఫలించి భారీ ఎత్తున ప్రజలు, పార్టీ శ్రేణులు హాజరయ్యారు. సత్తుపల్లి, పాలేరు సభల్లో మాదిరిగానే మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై వ్యంగ్యాస్త్రాలు సంధించిన కేసీఆర్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

**మీ మంత్రి పనిచేస్తేనే ఇవన్నీ..**

ఇదే జిల్లాకు చెందిన కవి రావెళ్ల వెంకటరామారావు తెలంగాణ రాకముందు 70 ఏళ్ల క్రితం 'నా తల్లి తెలంగాణరా.. వెలలేని నందనోద్యానమురా' అని పాట రాశారు. ఇప్పుడు ఖమ్మం పట్టణం చూసి గర్వపడుతున్న. ఒకనాడు ఇక్కడ పాదయాత్ర చేశా. నాడు గోళ్లపాడు మురికిగా ఉండె. లకారం చెరువు వికారంగా ఉంది. ఇవ్వాళ ఎంత సుందరంగా తయారైంది. అజయ్‌ను వెంటపెట్టుకుని తిరిగి రూ.100 కోట్లు ఇచ్చి ప్రత్యేకంగా పనులు చేయమని చెప్పా. ఇరుకు సందులు, మురికి కాల్వలు, దుర్గంధం, ట్రాఫిక్ కష్టాలు ఉండె.. ఈరోజు ఖమ్మం అంటే సిక్స్ లైన్ రోడ్డు, సందుల్లో వైట్‌టాప్స్ రోడ్లు, దారి పొడవునా లైట్లు, పచ్చని చెట్లు. ఇది మంత్రం, మాయ చేస్తే జరగలేదు.. మీ మంత్రి పనిచేస్తే జరిగింది.

**తీగల వంతెన కట్టాలని..**

ధంసలాపురం బ్రిడ్జి, మున్నేరు పొంగితే వరదలు వచ్చే ప్రాంతాలు, మున్నేరు రెండువైపులా బ్యూటిఫికేషన్ గురించి నాతో కొట్లాట పెట్టుకున్నడు అజయ్. నీకే ఎన్ని డబ్బులయ్యా అంటే.. కాదు సార్ మాకు కావాలని పట్టుపట్టి రూ.700కోట్లు మంజూరు చేయించుకున్నాడు. ఆయన కోరిక ఏమిటంటే మున్నేరుపై తీగల వంతెన కావాలని. ఈ బ్రిడ్జి అయితే ఇంకా అందం వస్తుందని ఆయన ప్రయత్నం.

**ఐటీ టవర్‌ను ఊహించామా?**

ఖమ్మంలో ఐటీ టవర్ కలలో కూడా ఊహించామా. అజయ్‌కి ఇక్కడ సొంతంగా మెడికల్ కాలేజీ ఉంది. అయినా పట్టుపట్టి ప్రభుత్వ మెడికల్ కాలేజీ తెప్పించుకున్నడు. రవాణా మంత్రిగా ఉన్నందుకు హైటెక్ బస్టాండ్ కట్టించాడు. రూ.40 కోట్లతో కల్యాణమండపం కట్టిస్తుండు. పద్ధతి ప్రకారం.. కమిట్‌మెంట్‌తో చేస్తే ఈ పనులన్నీ తయారవుతాయి.

**నీళ్ల కష్టాలు తప్పాయి..**

పక్కనే పాలేరు రిజర్వాయర్ ఉన్నా.. వారానికి ఒక రోజు నీళ్లు వచ్చేవి. బిందెలు పట్టుకుని యుద్ధాలు జరిగేవి. ఈ రోజు 75 వేల నల్లా కనెక్షన్లు ఖమ్మంలో ఇచ్చాం. రూ.1కి కనెక్షన్‌తో బ్రహ్మాండమైన పాలసీ తీసుకొచ్చాం. ఆడబిడ్డలు ఇంట్లోనే ట్యాప్‌లు తిప్పుతున్నరని అజయ్ చెబుతున్నడు. గతంలో కరెంట్ ఎట్ల ఉండె. ఈరోజు ఎలా ఉందో దయచేసి ఆలోచించాలి. గతంలో ప్రతీ ఇంట్లో ఇన్వర్టర్, కన్వర్టర్, స్టెబి లైజర్ ఉండగా, ఇప్పుడు అవేవీ లేవు.

**మట్టిరోడ్డు లేదు..**

మీకు మంచి ఎమ్మెల్యే, మంచి ఎంపీ ఉన్నరు. ఎమ్మెల్యే ఒక్క రఘునాథపాలెం మండలాన్ని రూ.300 కోట్లతో అభివృద్ధి చేసిండు. వెతుకుదామన్నా మట్టిరోడ్డు లేదు. ఇరవై కొత్త పంచాయతీలు చేయించి తీర్చిదిద్దాడు. మైనార్టీల కోసం ఖమ్మంలో మీ ఎమ్మెల్యే అన్నీ చేసినందుకే ప్రేమతో అజయ్ ఖాన్ అని పిలుస్తారు.

ఈ సభలో ఎంపీలు నామ నాగేశ్వరరావు, బండి పార్థసారధిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, వైరా ఎమ్మెల్యే రాములునాయక్, బీఆర్ఎస్ అభ్యర్థులు సండ్ర వెంకటవీరయ్య, కందాల ఉపేందర్‌రెడ్డి, లింగాల కమల్‌రాజ్, బానోతు మదన్‌లాల్, మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి, వివిధ సంస్థల చైర్మన్లు కొండబాల కోటేశ్వరరావు, కూరాకుల నాగభూషణం, బచ్చు విజయ్‌కుమార్, రాయల శేషగిరిరావు, దోరేపల్లి శ్వేత, మేయర్, డిప్యూటీ మేయర్లు పునుకొల్లు నీరజ, ఫాతిమా, జెడ్పీటీసీ మాలోత్ ప్రియాంక, నేతలు బొంతు రాంమోహన్, గుండాల కృష్ణ, పగడాల నాగరాజు, నల్లమల వెంకటేశ్వరరావు, కృష్ణచైతన్య, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, కొత్తూరు ఉమామహేశ్వరరావు, పులిపాటి ప్రసాద్, ఖమర్, షౌకత్‌అలీ, జహీర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

**వాడవాడలా సైకిల్‌పై తిరిగిండు..**

వాడవాడలో పువ్వాడ అని పేపర్లలో చదివి మేము చర్చ చేసే వాళ్లం. సైకిల్ వేసుకుని, ప్రజల్లో కలిసిపోయి.. బ్రహ్మాండంగా కష్టం చేస్తే ఇవన్నీ జరిగాయి. నాడు ఖమ్మంలో ఉన్న 400 కి.మీ. రోడ్లను 1,115 కి.మీ.కు, డ్రెయిన్లను 205 కి.మీ. నుంచి 1,592 కి.మీ.కు తీసుకుపోయింది పువ్వాడ కాదా ప్రజలు ఆలోచించాలి. గోళ్లపాడు కట్ట మీద ఉన్న వారికి వెలుగుమట్లలో పునరావాసం కల్పించాం. గోళ్లపాడు చానల్, లకారం చెరువు చిటికేస్తే కాలేదు. ఏడేళ్ల కష్టపడితే రూపు కనపడుతోంది. హెలీకాప్టర్ నుంచి చూస్తే సుందరంగా ఉంది.

**వాళ్లిద్దరు కరటక దమనకులు..**

జిల్లాలో ఇద్దరు కరటక, దమనకులు ఉన్నారు. పరవస్తు చిన్నయసూరి రాసిన కథ చదివితే వాళ్లేంటో తెలుస్తది. ఇవ్వాళ వాళ్ల పీడ వదిలి ఖమ్మం శుభ్రంగా ఉంది. జిల్లాలో మంచి రిజల్ట్స్ రాబోతున్నాయి. దీంట్లో అనుమానం లేదు. తిట్టాలంటే తిట్లు తక్కువ ఉన్నయా? అది కాదు రాజకీయం. అరాచకంగా మాట్లాడుతున్నరు. బీఆర్ఎస్ వారిని అసెంబ్లీ గడప తొక్కనీయనని ఒక అర్భకుడు మాట్లాడుతున్నాడు. ఖమ్మంను గుత్తకు పట్టినవా.. జిల్లానే కొనేశావా.. జిల్లా ప్రజలు.. ప్రజాస్వామ్యవాదులు దీన్ని సహిస్తరా? ఎంత వరకు ధర్మం. చైతన్యవంతమైన జిల్లా ఖమ్మం. పోరాటాల ఖిల్లా. కమ్యూనిస్టు పార్టీలు ఎంతో చైతన్యం తెచ్చాయి. వీటన్నింటినీ ప్రజలు ఆలోచించి మీ అమూల్యమైన ఓటు అజయ్‌కు వేయాలి.



ఖమ్మం ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం, పార్టీ శ్రేణులు

### సైడ్‌లైట్స్

- ప్రజా ఆశీర్వాద సభకు నగరంతో పాటు రఘునాథపాలెం మండలం నుండి మధ్యాహ్నం 12.30 గంటల నుండే జనం రావడం ఆరంభమైంది.
- గాయకుడు మద్దెల సందీప్ బృందం గులాబీల జెండలే రామక్క... అంటూ పాడిన పాటకు సభికులు నృత్యం చేశారు.
- వీరుల్లారా వీరవనితల్లారా... పాటను గాయకుడు సందీప్‌తో కలిసి మంత్రి అజయ్‌కుమార్ పాడుతూ నృత్యం చేశారు.
- కొత్తగూడెం సభ ముగిశాక సీఎం కేసీఆర్ సాయంత్రం 4.32 గంటలకు ఖమ్మం చేరుకున్నారు.
- హెలికాప్టర్ కనపడగానే ప్రజలు కేరింతలు కొడుతూ కేసీఆర్‌ను స్వాగతించారు.
- 4.32గంటలకు హెలీకాప్టర్ దిగిన కేసీఆర్‌కు మంత్రి అజయ్‌కుమార్, మేయర్ నీరజ స్వాగతం పలకగా, 4.37గంటలకు స్టేజీ పైకి చేరుకున్నారు.
- అక్కడ ముస్లిం పెద్దలు సీఎం కేసీఆర్‌కు దట్టీ కట్టారు.
- కేసీఆర్ 4.47గంటల నుంచి 5.04 గంటల వరకు ప్రసంగించారు. తిరిగి 5.14 గంటలకు హైదరాబాద్ బయలుదేరారు.
- సీఎం ప్రసంగం ఆద్యంతం ఖమ్మంకు ఇచ్చిన నిధులు, అభివృద్ధిపైనే సాగింది.
- కేసీఆర్‌తో పాటు మంత్రి అజయ్ కూడా తెలుగు, ఉర్దూలో మాట్లాడారు.
- పలువురు ఉద్యమకారులు తమకు ఉపాధి చూపించాలనే ప్లకార్డులు ప్రదర్శించారు.
- సభ నిఘా నీడలో సాగగా, ప్రతీఒక్కరికి బాడీ స్కానర్‌తో పరీక్షించి పంపించారు.
- పీజీ కళాశాలతో పాటు ఇతర భవనాలపై పోలీసు సిబ్బంది పహారా కాస్తూ బైనాక్యులర్లతో పరిశీలించారు.

– ఖమ్మం వన్‌టౌన్

జంగ్ తెలంగాణ

### ప్రజా ఆశీర్వాదం.. కేసీఆర్, కేటీఆర్ అండదండలు


ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజల ఆశీర్వాదంతో కేసీఆర్, కేటీఆర్ అండదండలతో ఈ భూమి పుత్రుడిగా ఖమ్మం నగరం, నియోజకవర్గాన్ని అద్భుతంగా అభివృద్ధి చేశానని రాష్ట్ర మంత్రి, బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ 24 గంటలు అందుబాటులో ఉంటూ, 50 ఏళ్లలో జరగని అభివృద్ధి ఐదేళ్లలో చేసి చూపించానని అన్నారు. కేసీఆర్ తన వెనక ఉండడంతో ఇది సాధ్యమైందని తెలిపారు. ఐటీ హబ్, బస్టాండ్, ధంసలాపురం పై ఓవర్ బ్రిడ్జి, కలెక్టరేట్, కేఎంసీ, వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్లు, వైకుంఠ ధామాలు, రహదారులు, లకారం ట్యాంక్‌బండ్, గోళ్లపాడు చానల్ ఇలా చెబుతూ పోతే గొంగళి పురుగులా ఉన్న ఖమ్మంను కేసీఆర్ సహకారంతో సీతాకోక చిలుకలా తీర్చిదిద్దామని చెప్పారు. ఇప్పుడు కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న వ్యక్తి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ట్యాంకర్లు తిరిగాయని.. కానీ ఇప్పుడు ఇంటింటికీ నల్లాల ద్వారా నీరు అందుతోందని తెలిపారు. సీఎం కేసీఆర్ మున్నేరుకు రక్షణ గోడ, తీగల వంతెన నిర్మాణానికి నిధులు ఇచ్చారని వివరించారు. ప్రతీ సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ మారుతూ, చిత్తశుద్ధి లేని వ్యక్తి 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉండి తనపై అవాకులు చెవాకులు పేలుతున్నారని విమర్శించారు. ప్రజలు అన్నీ ఆలోచించి కారు గుర్తుకు ఓటువేసి మరోమారు తనను ఆశీర్వదించాలని అజయ్‌కుమార్ కోరారు.



కేసీఆర్‌కు పాదాభివందనం చేస్తున్న అజయ్‌కుమార్

# ఆమె గళం.. అంతంతే!



ఖమ్మంమయూరిసెంటర్: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా రాజకీయ రంగంలో మాత్రం పార్టీల నుంచి టికెట్ల కేటాయింపు అంతంత మాత్రంగానే ఉంటోంది. వారికి రిజర్వేషన్లు ఉన్న స్థానిక సంస్థల్లోనూ భర్త చాటు భార్యలు.. తండ్రి చాటు కూతుళ్లకు మాత్రమే టికెట్లు దక్కుతున్నాయనే ప్రచారం ఉంది. స్వశక్తితో రాజకీయాల్లో రాణిస్తున్న మహిళా ప్రతినిధులు తక్కువ మందే ఉంటున్నారు. కొందరు జెడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానాలకే పరిమితమవుతుండగా.. చట్టసభల్లో ప్రాతినిధ్యం మాత్రం నామమాత్రంగా కూడా ఉండడం లేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను 1952 నుంచి ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు జరిగిన 15 శాసనసభ ఎన్నికల్లో ఐదుగురు మాత్రమే మహిళలు చట్టసభలకు ప్రాతినిధ్యం వహించారు.

**సగానికి పైగా వారే..**

గత నెల 4న జారీ చేసిన ఓటర్ల జాబితా ప్రకారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువగా ఉంది. మొత్తం 21,41,387 మంది ఓటర్లకు గాను మహిళలు 10,99,548 మంది ఉన్నారు. ఖమ్మం జిల్లాలో 11,96,293 మంది ఓటర్లకు గాను పురుషులు 5,80,411 మంది, మహిళలు 6,15,807 మంది ఉన్నారు. ఇక భద్రాద్రి జిల్లాలోని 9,45,094 మంది ఓటర్లలో పురుషులు 4,61,315 మంది, మహిళలు 4,83,741 మంది ఉన్నారు. జిల్లాల వారీగానే కాకుండా అన్ని నియోజకవర్గాల్లోనూ వీరే అధికంగా ఉన్నప్పటికీ అవకాశాలు కల్పించడంలో ప్రధాన పార్టీలు చిన్న చూపు చూస్తున్నాయనే ఆవేదన మహిళా నాయకుల్లో ఉంది.

**అప్పుడప్పుడే విజయాలు**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వివిధ స్థానాల నుంచి మహిళలు ఐదుగురు ఎమ్మెల్యేలుగా ఎన్నికైనా ప్రతీ విజయానికి మధ్య ఏళ్ల తరబడి వ్యవధి ఉంది. తొలిసారి 1952లో జరిగిన ఎన్నికల్లో ఖమ్మం నుంచి లక్ష్మీకాంతమ్మ విజయం సాధించగా.. మళ్లీ 1972లో మధిర నుంచి దుగ్గినేని వెంకట్రావమ్మ గెలిచారు. ఆతర్వాత 37 ఏళ్ల అనంతరం 2009 ఎన్నికల్లోనే వైరా నుంచి బానోతు చంద్రావతి, భద్రాచలం నుంచి కుంజా సత్యవతికి విజయం దక్కింది. అనంతరం 2018 ఎన్నికల్లో హరిప్రియ గెలిచారు. ఇంకా కాంగ్రెస్, బీజేపీ జాబితా పూర్తిగా ప్రకటించలేదు. వాటిలో మహిళలకు స్థానం దక్కుతుందేమో చూడాలి. తాజాగా సీపీఎం ప్రకటించిన జాబితాలో సత్తుపల్లి నుంచి మాచర్ల భారతికి టికెట్ కేటాయించారు.

**ఇప్పటి వరకు ఐదుగురు..**

స్వాతంత్య్రం వచ్చాక 1952 నుంచి ఎన్నికలు జరుగుతున్నాయి. 1952, 57 సంవత్సరాల్లో ద్విసభ్య స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. అనంతరం 1962 నుంచి సాధారణ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మొత్తంగా 15 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా నుంచి ఐదుగురు మహిళలే ఎమ్మెల్యేలుగా ఎన్నికై అసెంబ్లీలో అడుగుపెట్టారు. 1957లో ఖమ్మం ద్విసభ్య స్థానానికి జరిగిన ఎన్నికల్లో తేళ్ల లక్ష్మీకాంతమ్మ రెండో అభ్యర్థిగా కాంగ్రెస్ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. ఆ తర్వాత 1972లో మధిర నుంచి దుగ్గినేని వెంకట్రావమ్మ కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2009లో భద్రాచలం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కుంజా సత్యవతి, వైరా నియోజకవర్గం నుంచి సీపీఐ తరుపున పోటీ చేసిన బి.చంద్రావతి గెలిచారు. గత ఎన్నికల్లో ఇల్లెందు నుంచి బానోతు హరిప్రియ విజయం సాధించారు. ఇక ఈసారి ఎన్నికల్లోనూ ప్రధాన పార్టీల్లో పరిశీలిస్తే బీఆర్ఎస్ నుంచి ఇల్లెందులో హరిప్రియకు టికెట్ దక్కింది. ఇంకా కాంగ్రెస్, బీజేపీ కొన్ని నియోజకవర్గాలకు టికెట్లు ప్రకటించాల్సి ఉన్నా మహిళలకు అవకాశం దక్కే సూచనలు కనిపించడం లేదు. ఇంకొన్ని పార్టీల్లో మాత్రం మహిళలకు టికెట్లు కేటాయించినా ఎందరు విజయం సాధిస్తారనేది వేచి చూడాల్సిందే.



తేళ్ల లక్ష్మీకాంతమ్మ



దుగ్గినేని వెంకట్రావమ్మ



కుంజా సత్యవతి



బానోతు చంద్రావతి



బానోతు హరిప్రియ

**అసెంబ్లీకి వెళ్లిన మహిళలు తక్కువే..**

- ఉమ్మడి జిల్లా నుంచి కొద్దిమందికే అవకాశం
- పదిహేను ఎన్నికల్లో ఐదుగురిని వరించిన విజయం
- అంతగా ప్రాధాన్యత ఇవ్వని ప్రధాన పార్టీలు
- రెండు జిల్లాల్లో మహిళా ఓటర్లే ఎక్కువ!

# బరిలోకి దిగారు...

- ఉమ్మడి జిల్లాలోని ఏడు స్థానాల్లో సీపీఎం పోటీ
- అభ్యర్థులను ప్రకటించిన నాయకత్వం
- పాలేరు నుంచి పోటీకి దిగుతున్న రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీపీఎం అభ్యర్థులు బరిలోకి దిగుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 17 స్థానాల్లో పోటీ చేస్తామని ఆ పార్టీ ప్రకటించగా.. ఆదివారం 14 స్థానాలకు అభ్యర్థులను వెల్లడించింది. ఇందులో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఖమ్మంతో పాటు పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి, భద్రాచలం, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రధానంగా పాలేరు నుంచి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పోటీ చేయనున్నట్లు వెల్లడించారు. సీపీఎం తొలుత కాంగ్రెస్ పార్టీతో పొత్తుపై చర్చలు జరిపినా ఫలప్రదం కాలేదు. కాంగ్రెస్ పార్టీకి తమ్మినేని అల్టిమేటం జారీ చేసినప్పటికీ స్పందించకపోవడంతో ఎన్నికల్లో ఒంటరిగానే బరిలో దిగాలని నిర్ణయించారు.

**పాలేరు బరిలో రెండోసారి..**

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం రెండోసారి పాలేరు నుంచి అసెంబ్లీ బరిలో నిలవనున్నారు. 2004 ఎన్నికల్లో ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సీపీఎం అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన, టీడీపీ అభ్యర్థి బి.లక్ష్మీనారాయణపై విజయం సాధించారు. ఆ తర్వాత 2009 ఎన్నికల్లో పాలేరు నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి వెంకటరెడ్డి చేతిలో ఓడిపోయారు. ప్రస్తుత ఎన్నికల్లో మళ్లీ పాలేరు నుంచి బరిలోకి దిగుతున్నారు. కాగా, ఆయన 1991లో ఖమ్మం పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసినా ఓటమి ఎదురైంది. కానీ 1996లో మాత్రం గెలుపొందారు.

**తమ్మినేని వీరభద్రం బయోడేటా..**



- స్వగ్రామం : తెల్దారుపల్లి, ఖమ్మం రూరల్ మండలం
- విద్యాభ్యాసం : ప్రాథమిక విద్య తెల్దారుపల్లిలో, హైస్కూల్ విద్య తల్లంపాడులో పూర్తిచేశారు. కళాశాల విద్య సూర్యాపేట జిల్లా కోదాడలో అభ్యసించారు.
- కుటుంబం : భార్య ఉమ, కుమార్తె శృతి, కుమారుడు సంఘమిత్ర
- రాజకీయ ప్రవేశం : 1971లో సీపీఎంలో చేరారు. ఖమ్మం డివిజన్, జిల్లా యువజనోద్యమ నిర్మాణానికి కృషి చేశారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

**ఉమ్మడి జిల్లాలో పోటీ చేసే స్థానాలు, అభ్యర్థులు**

| నియోజకవర్గం | అభ్యర్థి |
|---|---|
| పాలేరు | తమ్మినేని వీరభద్రం |
| ఖమ్మం | యర్రా శ్రీకాంత్ |
| మధిర | పాలడుగు భాస్కర్ |
| వైరా | భూక్యా వీరభద్రం |
| సత్తుపల్లి | మాచర్ల భారతి |
| భద్రాచలం | కారం పుల్లయ్య |
| అశ్వారావుపేట | పిట్టల అర్జున్ |

## క్లుప్తంగా

### ఒకే దఫా రూ.2 లక్షల రుణమాఫీ



ప్రచారంలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

ముదిగొండ: రైతులు ఎదురుచూస్తున్నట్లుగా రూ.2 లక్షల రుణమాఫీని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చేస్తామని మధిర కాంగ్రెస్ అభ్యర్థి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ముదిగొండ మండలంలోని మల్లన్నపాలెం, పమ్మి, చిరుమర్రి, సువర్ణాపురం, ముదిగొండ, వెంకటాపురం, గోకినేపల్లి గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామా ల్లో నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఘనస్వాగతం పలకగా, పమ్మిలో చిన్నారులను పలకరించి చదువుపై ఆరా తీశారు. అనంతరం జరిగిన సమావేశాల్లో భట్టి మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే నిరుపేదలను ఆదుకున్నామని తెలిపారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు, మహిళలకు వడ్డీలేని రుణాలు, రైతులకు మద్దతు ధర చెల్లిస్తూ కల్లాల వద్దే ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వం మార్కెట్‌కు తరలించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలోనూ విఫలమవుతోందని ఆరోపించారు. ప్రచారంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మండల అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మినేని రమేశ్‌బాబు, తాటికొండ రమేశ్‌తోపాటు ప్రజాప్రతినిధులు, నాయకులు చిలకల విజేత, వడ్డే మాధవరావు, ఏలూరి హనుమంతరావు, వనం ప్రదీప్తబాబు, మందరపు నాగేశ్వరరావు, ఇలవల వీరారెడ్డి, మట్టా బాబురాంరెడ్డి, చిలకల రామకృష్ణ, ఎండీ అజ్గర్, పల్లపాటి కృష్ణ, పందిరి అంజయ్య, ధర్మానాయక్, ఆదినారాయణరెడ్డి, బుచ్చిరామయ్య, ఉపేందర్‌రావు పాల్గొన్నారు.

### రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

– ఎన్నికల ప్రచారంలో కందాల



ప్రచారంలో మాట్లాడుతున్న ఉపేందర్‌రెడ్డి

ఖమ్మంరూరల్: నియోజకవర్గమంతా అభివృద్ధి చెందాలన్నదే తన లక్ష్యమని, అందుకోసం రాజకీయాలను పక్కన పెట్టి పనులు మంజూరు చేయించానని పాలేరు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కందాల ఉపేందర్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని దానవాయిగూడెం, కామంచికల్, దారేడులో ఆదివారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కామంచికల్‌లో కందాల మాట్లాడుతూ.. రూరల్ మండలానికి ఏ పని కావాలన్నా తాను చేసి పెట్టానని చెప్పారు. కామంచికల్‌తో తనకు పదిహేనేళ్లుగా అనుబంధం ఉందని తెలిపారు. గ్రామంపై అభిమానం, బీఆర్ఎస్ నాయకత్వాన్ని పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి పనులు చేశానన్నారు. ఖమ్మం నుంచి డోర్నకల్ వరకు డబుల్ రోడ్ నిర్మాణ పనులు కూడా తానే చేయించినట్లు తెలిపారు. ఈ అభివృద్ధి కొనసాగేలా మరోమారు తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. తొలుత కరుణగిరిలోని నాలుగో తరగతి ఉద్యోగులకాలనీ చర్చిలో కందాల ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేదరమెట్ల శ్రీను, తొండల సత్యనారాయణ, వెంకన్న పాల్గొన్నారు.

### మల్లేపల్లిలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

రఘునాథపాలెం: మండలంలోని మల్లేపల్లిలో బీఆర్ఎస్‌లోని ఇరువర్గాలు ఆదివారం ఘర్షణ పడగా, ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మంలో జరిగిన సీఎం సభకు తరలివెళ్లడానికి గ్రామానికి వచ్చిన బస్సుల విషయమై బీఆర్ఎస్‌లోని ఇరువర్గాలకు ఘర్షణ జరిగింది. తమ కోసం బస్సు పంపారని ఒక వర్గం.. కాదు తమ కోసమే వచ్చిందని ఇంకో వర్గం వారు గొడవపడ్డారు. అందరినీ తీసుకెళ్తే తప్ప బస్సులు కదలనిచ్చేది లేదని పలువురు అడ్డుగా కూర్చోవడంతో గొడవ పెరిగి రాళ్లు రువ్వుకున్నారు. ఈ ఘటనలో మల్లేపల్లికి చెందిన నాగేశ్వరరావు, గడ్డికుంట తండాకు చెందిన వీరన్న, నరేందర్ గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించగా.. ఇరువర్గాల వారు రఘునాథపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై ఎస్ఐ కొండల్‌రావును వివరణ కోరగా ఫిర్యాదులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విచారణ చేస్తున్నామని తెలిపారు.

### చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురం క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈనెల 3వ తేదీ రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. ఇందులో చింతకానికి చెందిన కైలాసపు వెంకటేశ్వర్లు(27) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమార్తె ఉండగా.. కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు.

### పామాయిల్ గెలలు



| | |
|---|---|
| టన్ను ధర | రూ.12,196 |

# పైసలు పట్టుకెళ్లాలంటే గోసే!

**ఎన్నికల కోడ్ నేపథ్యాన తంటాలు**
- బ్యాంకులు, వ్యాపార కేంద్రాల వద్ద పోలీసుల నిఘా
- బెంబేలెత్తిపోతున్న సామాన్యులు
- నగదు సీజ్ చేస్తుండటంతో సాధారణ కార్యకలాపాలకు అంతరాయం




నేలకొండపల్లిలో తనిఖీలు చేస్తున్న పోలీసులు (ఫైల్)

● ఖమ్మం సారథినగర్‌కు చెందిన ఓ వ్యాపారి కుమారుడు అమెరికా వెళ్లనుండగా, ఖాతాలో చూపించేందుకు రూ.11 లక్షలు డిపాజిట్ చేసేందుకు త్రీటౌన్ ప్రాంతంలోని ఓ బ్యాంక్‌కు వెళ్లాడు. అప్పటికే అక్కడ మఫ్టీలో ఉన్న పోలీసులు ఆయన బ్యాగ్‌ను తనిఖీ చేసి సీజ్ చేశారు. తన కుమారుడు అమెరికా వెళ్లాల్సి ఉందని బతిమిలాడినా వినకపోగా.. ఆధారాలు చూపించి డబ్బును తీసుకోవడానికి పది రోజులు పట్టింది. ఫలితంగా ఆయన కుమారుడి అమెరికా ప్రయాణం నెల వాయిదా పడింది.

● ప్రముఖ వ్యాపార కూడలి అయిన ఖమ్మం గాంధీచౌక్‌కు చెందిన ఓ వ్యాపారి బ్యాంక్‌లో నగదు జమ చేసేందుకు వెళ్తుండగా తనిఖీ చేశారు. ఆయన వద్ద రూ.5 లక్షలు ఉండడంతో రూ.50 వేలు ఇచ్చి రూ.4.50 లక్షలు సీజ్ చేశారు. ఆయన పత్రాలు చూపించి డబ్బు తీసుకునేందుకు పది రోజులకు పైగా పట్టగా వ్యాపార లావాదేవీలు నిలిచిపోయాయి.

ఖమ్మంక్రైం: వీరిద్దరే కాదు జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి వ్యాపారులు, చాలా మంది ప్రజలు ఈ పరిస్థితి ఎదుర్కొంటున్నారు. అవసరాలు, కారణాలు సరిగ్గా పరిశీలించకుండా.. వివరాలు తెలుసుకోకుండా కనిపించిన నగదును సీజ్ చేస్తుండంతో ఇబ్బంది పడుతున్నారు. బ్యాంకులు, వ్యాపార కూడళ్ల వద్ద మఫ్టీలో ఉంటున్న పోలీసులు రూ.50 వేలకు మించి ఎవరి వద్ద నగదు ఉన్నా స్వాధీనం చేసుకుంటున్నారు. అన్ని పత్రాలు ఉండాలని అధికారులు చెబుతున్నా.. రోజువారీ లావాదేవీలు, వ్యాపార, కుటుంబ అవసరాల కోసం నగదు తీసుకెళ్తున్న వారు చిక్కుల్లో పడుతున్నారు.

**బ్యాంకుల వద్ద మకాం**

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన దగ్గర నుంచి చెక్‌పోస్ట్‌ల వద్ద తనిఖీలు ముమ్మరం చేసిన పోలీసులు.. గతంలో ఎన్నడూ లేని విధంగా బ్యాంకులు, వ్యాపార లావాదేవీలు జరిగే ప్రాంతంలో తిష్ట వేయడం గమనార్హం. నిత్యం వ్యాపారాలు చేసే వారికి రూ.లక్షల్లో నగదు లావాదేవీలు తప్పనిసరి. ఇంకోపక్క వివాహాల సీజన్ కావడంతో దుస్తులు, వెండి, బంగారం కొనుగోలుకు వస్తున్న వారు సైతం పోలీసుల చేతుల్లో చిక్కుకుంటున్నారు. దీంతో పోలీసులను చూస్తే భయపడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఒకవేళ ఎన్నికల కోసం నగదు పంచే వారే అయితే బహిరంగంగా పట్టుకెళ్లరని తెలిసినా నిబంధనలు ఉన్నాయని పోలీసులు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. ఈ అంశంపై పోలీస్ అధికారులను వివరణ కోరగా ఈ విషయంలో తామేమీ చేయలేమని, రూ.50 వేలకు మించి నగదు సరైన పత్రాలు లేకుండా తీసుకెళ్తే సీజ్ చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. అన్ని ఆధారాలను అధికారులకు చూపించి నగదు తీసుకోవచ్చని చెబుతున్నా.. ఇందుకు రోజుల తరబడి సమయం పడుతుండడంతో పనులు నిలిచిపోతున్నాయనే ఆవేదన వ్యక్తమవుతోంది.

**రూ.35 కోట్లు సీజ్**

అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి జిల్లాలో రూ.35,02,04,997 నగదు సీజ్ చేశారు. ఇందులో సరైన ఆధారాలు చూపించిన వ్యక్తులకు రూ.27.03 కోట్ల మేర నగదు తిరిగి ఇచ్చేశారు. మిగతా రూ.8 కోట్ల పైచిలుకు నగదు ఇంకా ఖజానాలో ఉంది. వీటికి సంబంధించిన వ్యక్తులు బిల్లులు, ఇతరత్రా పత్రాల సేకరణలో నిమగ్నమయ్యారని తెలుస్తోంది.

## వీరే కీలకం..

- జీఎల్ఓ నుంచి జిల్లా ఎన్నికల అధికారి వరకు బాధ్యతలు
- సమన్వయంతో పనిచేస్తేనే సజావుగా ఎన్నికల ప్రక్రియ
- ఓటరు జాబితా తయారీ నుంచి ఫలితాల వెల్లడి వరకు అప్రమత్తం..

భద్రాచలంఅర్బన్: ఎన్నికల నిర్వహణ ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకం. ఓటరు నమోదు నుంచి పోలింగ్, లెక్కింపు వరకు అధికార యంత్రాంగానికి శ్రమ తప్పదు.

**జిల్లా ఎన్నికల అధికారి**

కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. అధికారులకు విధుల కేటాయింపు మొదలుకుని, వారికి ఇచ్చే శిక్షణ, ఇతర కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. నిత్యం సమీక్షల ద్వారా అధికారులకు దిశా నిర్దేశం చేస్తారు. ఓటరు జాబితా తయారీ నుంచి ఓట్ల లెక్కింపు వరకు కలెక్టర్‌దే బాధ్యత.

**ప్రిసైడింగ్ అధికారి**

ప్రతీ పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. పోలింగ్‌కు అవసరమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఇతర సామగ్రి తీసుకొస్తారు. ఆ కేంద్రం పూర్తి బాధ్యత ఆయనదే. ఓటింగ్ ముగిసిన తర్వాత యంత్రాలను బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూంకు తరలిస్తారు. వీరికి సాయంగా అదనపు ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. వీరితోపాటు ముగ్గురు పోలింగ్ అధికారులు ఉంటారు. వీరంతా ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు లోబడి పనిచేయాల్సి ఉంటుంది. పోలింగ్ ప్రారంభానికి ముందే ఈవీఎంలు పనితీరును పీఓలు చూడాల్సి ఉంటుంది.

**బీఎల్‌ఓలు**

గ్రామ, నగరం, పట్టణ స్థాయిలో పనిచేసే వారే బీఎల్‌ఓలు (బూత్ స్థాయి అధికారి). అర్హులైన వారందరిపేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలి. కొత్తగా నమోదుతోపాటు మార్పులు, చేర్పులు, తొలగింపునకు కావాల్సిన దరఖాస్తులు వారి వద్ద ఉంటాయి. ఓటరు జాబితా తయారీలో పైస్థాయి అధికారులకు సహకారం అందిస్తారు.

**రిటర్నింగ్ అధికారి (ఆర్వో)**

ప్రతీ నియోజకవర్గానికి ఒక రిటర్నింగ్ అధికారి ఉంటారు. వీరిని ఎన్నికల సంఘం నియమిస్తుంది. వారు తమ పరిధిలో ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తారు. నామినేషన్ స్వీకరణ మొదలు, పరిశీలన, తిరస్కరణ, అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, సిబ్బంది నియామకం, వారికి శిక్షణ, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి వరకు వారిదే బాధ్యత.

**సెక్టోరియల్ అధికారి**

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించే బాధ్యత సెక్టోరియల్ అధికారిపై ఉంటుంది. ర్యాంప్ ఏర్పాటు, విద్యుత్, తాగునీరు, మౌలిక వసతులు కల్పించే విధంగా చూస్తారు. ఒక్కో సెక్టోరియల్ అధికారికి ఆరు పోలింగ్ కేంద్రాలు ఉంటాయి. పోలింగ్ కేంద్రం తోపాటు పరిసరాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలి. పోలింగ్ సమయంలో ఎలాంటి పొరపాట్లు జరిగినా వారిదే బాధ్యత.

## ఎన్నికల పోటీల్లో నేనే గెలుస్తా !



భద్రాచలం నియోజకవర్గంలో అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొదెం వీరయ్య ఆదివారం పట్టణంలోని గ్రౌండ్‌లో వాకర్లతో ముచ్చటించారు. చిన్నా అక్కడ క్రికెట్ ఆడుతున్న వారితో కలిసి కాసేపు బ్యాటింగ్ చేశారు. ఆ తర్వాత వాలీబాల్ కూడా ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. – భద్రాచలం

## మీ 'బరువు' బాధ్యతలు నావే!



పాలేరు బీఎస్పీ అభ్యర్థి డాక్టర్ అల్లిక వెంకటేశ్వరరావు ఆదివారం నేలకొండపల్లి మండలం సదాశివాపురం తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా హమాలీలతోపాటు ధాన్యం బస్తాలను మోస్తూ ఓట్లను అభ్యర్థించారు. తనకు ఒకసారి అవకాశమిస్తే ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటానని, అభివృద్ధి పాటుపడతానని భరోసా కల్పించారు. – నేలకొండపల్లి

# సమస్యాత్మకం @390

- ఇప్పటికే కీలక బూత్‌ల గుర్తింపు
- అక్కడ ప్రత్యేక ఏర్పాట్లపై అధికారుల దృష్టి
- పోలింగ్ రోజున అదనపు భద్రత

ఖమ్మం సహకారనగర్: బోనకల్ మండలం గోవిందాపురం(ఎల్)లో ఇటీవల సీపీఎం, కాంగ్రెస్ శ్రేణుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో గాయపడిన సీపీఎం శ్రేణుల్లో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. ఇలా తరచుగా ఘర్షణలు జరిగే గ్రామాలు జిల్లాలో మరికొన్ని ఉన్నాయి. దీంతో ఎన్నికల వేళ ఉద్రిక్తతలు చోటు చేసుకోకుండా యంత్రాంగం దృష్టి సారిస్తోంది.

**లెక్కలు తేల్చారు...**

త్వరలో జరగనున్న శాసనసభ ఎన్నికలకు అధికార యంత్రాంగం దాదాపుగా సన్నద్ధమైందనే చెప్పుకోవచ్చు. ఈ క్రమాన జిల్లాలోని ప్రాంతాలు, బూత్‌ల వారీగా ఎన్ని సమస్యాత్మకం, ఎన్ని సాధారణమైనవో లెక్కలు తేల్చారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో 822 ప్రాంతాల్లో 1,455పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ఇందులో 193 ప్రాంతాల్లో 390పోలింగ్ బూత్‌లు సమస్యాత్మకవని తేల్చారు. అయితే, పోలింగ్ తేదీ నాటికి ఈ సంఖ్యలో మార్పులు, చేర్పులు జరిగే అవకాశముంది.

**నియోజకవర్గాల వారీగా సమస్యాత్మక ప్రాంతాలు, బూత్‌ల వివరాలు**

| నియోజవర్గం | ప్రాంతాలు | పోలింగ్ బూత్‌లు |
|---|---|---|
| ఖమ్మం | 19 | 44 |
| పాలేరు | 53 | 103 |
| మధిర | 44 | 95 |
| వైరా | 41 | 67 |
| సత్తుపల్లి | 36 | 81 |
| మొత్తం | 193 | 390 |

## రూ.500 నోట్లు ఎక్కడ?!

సత్తుపల్లిరూరల్: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి రూ.500 నోట్లు కనిపించడం లేదని వ్యాపారులు, ప్రజలు వాపోతున్నారు. గతంలో రూ.500 నోటు తీసుకొస్తే చిల్లర ఇచ్చేందుకు రూ.200, రూ.100, రూ.50 నోట్లు ఉండేవి కాదు. కానీ ఇప్పుడు బ్యాంకులు, ఏటీఎంల్లో తప్ప మార్కెట్‌లో రూ.500 నోట్ల చెలామణి గణనీయంగా పడిపోయింది. వైన్స్, బార్లే కాకుండా ఎక్కువ నగదు లావాదేవీలు జరిగే ఎక్కడైనా సరే రూ.200, రూ.100, రూ.50 నోట్లే కళకళలాడుతున్నాయి. మళ్లీ ఎన్నికలు ముగిశాక నోట్లు వస్తాయేమో చూడాలి!

## కేసీఆర్ పర్యటనకు భారీ బందోబస్తు



పోలీసులకు సూచనలు చేస్తున్న సీపీ వారియర్



బైనాక్యులర్‌తో పరిశీలిస్తున్న పోలీస్

ఖమ్మంక్రైం: ఖమ్మంలో జరిగిన ప్రజా ఆశీర్వాదసభకు సీఎం కేసీఆర్ హాజరు కాగా, పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలకు ముందుగానే చేరుకున్న సీపీ విష్ణు ఎస్.వారియర్ సిబ్బందికి సూచనలు చేస్తూ కనిపించారు. అలాగే, ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ అనిల్‌కుమార్, సీఎం సెక్యూరిటీ వింగ్ ఐజీ తఫ్సీర్ ఇక్బాల్, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి బందోబస్తు పర్యవేక్షించారు. సభాస్థలి వద్ద ఉదయమే బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేపట్టాయి. కాగా, ఖమ్మంతో పాటు మహబూబాబాద్ జిల్లాలకు చెందిన సుమారు వేయి మంది పోలీసు సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు.

# ఈ కొద్ది సమయం కష్టపడండి

- అందరి సంక్షేమం.. కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యత
- కాంగ్రెస్ కార్యకర్తలకు పొంగులేటి పిలుపు




మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన తుమ్మల తదితరులు

ఖమ్మంరూరల్/తిరుమలాయపాలెం: రాబోయే ఇరవై మూడు రోజులు కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు అందరూ కష్టపడి పనిచేయాలని, తద్వారా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అందరి సంక్షేమం బాధ్యతను స్వీకరిస్తానని పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం, తిరుమలాయపాలెంలలో ఆదివారం జరిగిన బూత్‌లెవల్ కమిటీల కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాతోపాటు రాష్ట్రంలో ఎవరు ఎదురొచ్చినా కాంగ్రెస్ విజయాన్ని ఆపలేరని తెలిపారు. అయితే, ప్రజలు బెదిరింపులకు లొంగకుండా ఇందిరమ్మ రాజ్యం స్థాపనకు కార్యకర్తలు శ్రమించాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు కష్టపడి గెలిపించిన ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. మళ్లీ ఇప్పుడు గెలవడానికి కాంగ్రెస్ కార్యకర్తలకు తప్పుడు హామీలు ఇస్తున్నారని విమర్శించారు. ఈ విషయాన్ని గుర్తించి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఖమ్మం అభ్యర్థి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కరువుతో అల్లాడిన తిరుమలాయపాలెం మండల రైతులకు సాగు నీరు అందేలా కృషి చేశానని తెలిపారు. ఈ మేరకు అందరూ సమష్టిగా పనిచేసి భారీ మెజార్టీతో పొంగులేటి శ్రీనివాసరెడ్డిని గెలిపించాలని కోరారు. త్వరలో ఏర్పడబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో అందరి సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. సమావేశాల్లో పీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నాయకులు, ప్రజాప్రతినిధులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, మద్దినేని బేబీస్వర్ణకుమారి, బెల్లం శ్రీనివాస్, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, మానుకొండ రాధాకిశోర్, కళ్లెం వెంకటరెడ్డి, రామసహాయం నరేశ్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, బుద్దా వంశీకృష్ణ కొప్పుల అశోక్, గంధ్ర గోపాల్‌రావు, నిరంజన్‌రెడ్డి, బొబ్బిలి భరత్ చంద్ర, మద్దినేని మధు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు

- వైరా రిటర్నింగ్ అధికారి సత్యప్రసాద్



సత్యప్రసాద్

వైరా: వైరా నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయ్యేలా, సమస్యాత్మక గ్రామాల్లోనూ శాంతియుత వాతావరణం నెలకొనేలా ఏర్పాట్లు చేస్తున్నామని రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన వైరాలో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 250 పోలింగ్‌బూత్‌లు ఉండగా, ఒక్కో బూత్‌లో ఐదుగురు పోలింగ్ సిబ్బందిని నియమిస్తున్నట్లు చెప్పారు. మొత్తం నియోజకవర్గంలో 2 వేల మంది ఉద్యోగులు విధులు నిర్వర్తించనుండగా, 315 ఈవీఎంలు, 352 వీవీ ప్యాట్లు వినియోగిస్తామని తెలిపారు. ఈసారి అన్ని పోలింగ్ బూత్‌లలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రతీ బూత్‌లో దివ్యాంగులకోసం వీల్ చెయిర్, వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటారని, నియోజకవర్గంలో పది సమస్యాత్మక గ్రామాలు ఉండగా, సీఆర్‌పీఎఫ్ బలగాలతో భద్రత ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కాగా, ప్రతీ ఒక్కరు సీ-విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని నిబంధనల ఉల్లంఘనపై ఫిర్యాదులు చేయొచ్చని సత్యప్రసాద్ వెల్లడించారు.

## ఉమెన్స్ ఎక్స్‌క్లూజివ్ టాటా కార్ షోరూం ఖమ్మంలో..

'వెంకటరమణ' ఆధ్వర్యాన ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ శైలజ, ద్రౌపతి, పక్కన రాజేంద్రప్రసాద్ తదితరులు

ఖమ్మంఅర్బన్: టాటా మోటార్స్ కంపెనీ ప్యాసింజర్ వెహికల్ విభాగంలో అధీకృత డీలర్ అయిన వెంకటరమణ మోటార్స్ ద్వారా మహిళల కోసం ప్రత్యేక షోరూంను ఖమ్మంలో ఏర్పాటుచేసింది. ఖమ్మంలోని శ్రీశ్రీ సర్కిల్‌లో ఏర్పాటుచేసిన షోరూంను ఆదివారం డాక్టర్ బోడేపూడి శైలజ ప్రారంభించి మాట్లాడారు. వెంకటరమణ మోటార్స్ ద్వారా ఖమ్మంలో మహిళల కోసం మహిళా ఉద్యోగులతో ప్రత్యేక షోరూం ప్రారంభించడం అభినందనీయమన్నారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. వెంకటరమణ మోటార్స్ ద్వారా మహిళల కోసం దేశంలో మొదటగా హైదరాబాద్‌లో, రెండో షోరూం ఖమ్మంలో ప్రారంభించామని తెలిపారు. ఇక్కడ సెక్యూరిటీ మొదలు ఉద్యోగలందరూ మహిళలే ఉంటారని వెల్లడించారు. ఇక్కడ ప్రత్యేక డిస్కౌంట్, ప్రత్యేక బహుమతులు ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంస్థ చైర్మన్ ద్రౌపతి, ఉద్యోగులు పాల్గొన్నారు.

## రెండు మట్టి టిప్పర్లు ఢీ..

- కేబిన్‌లో ఇరుక్కున్న ఒక డ్రైవర్ మృతి
- జేసీబీతో గంట పాటు శ్రమించి మృతదేహం తొలగింపు



నుజ్జునుజ్జయిన వాహనాల ముందు భాగం (ఇన్‌సెట్) శ్రీనివాసరావు (ఫైల్)

రఘునాథపాలెం: రఘునాథపాలెం బైపాస్‌రోడ్డులోని నర్సింహులు చెరువు సమీపాన మూలమలుపు వద్ద ఆదివారం అతివేగంగా వచ్చిన రెండు మట్టి టిప్పర్లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒక డ్రైవర్ కేబిన్‌లోనే ఇరుక్కుని మృతిచెందాడు. మరో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. రఘునాథపాలెం ఎస్ఐ కొండల్‌రావు కథనం ప్రకారం.. చింతకాని మండలం నాగిలిగొండకు చెందిన నక్క శ్రీనివాసరావు (52) రోజులాగే టిప్పర్‌లో మట్టిలోడ్ తీసుకుని రఘునాథపాలెం వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా మట్టిలోడుతో ఇంకో టిప్పర్ వస్తుండగా, మూలమలుపు వద్ద ఢీకొన్నాయి. ఈ సమయంలో రెండు వాహనాలు అతివేగంతో ఉండగా టిప్పర్ల కేబిన్లు నుజ్జునుజ్జయ్యాయి. దీంతో శ్రీనివాసరావు కేబిన్‌లోనే ఇరుక్కుని మృతి చెందగా, మరో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి.

**గంట పాటు శ్రమించి..**

టిప్పర్లు ఢీకొని ముందు భాగాలు నుజ్జునుజ్జు కావడం, ఒక డ్రైవర్ అందులో ఇరుక్కుపోవడంతో పోలీసులు గంటపాటు శ్రమించాల్సి వచ్చింది. జేసీబీని తెప్పించి రెండు టిప్పర్లను వెనక్కి లాగి కేబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ శ్రీనివాసరావు మృతదేహాన్ని బయటకు తీసి అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో ఆస్పత్రికి తరలించారు. కాగా, డ్రైవర్ శ్రీనివాసరావుకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలున్నారు.

## ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

సత్తుపల్లి: మానసిక ఒత్తిడికి గురైన వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన బత్తుల అనురాధ (45) భర్త శ్రీనివాసరావు నాలుగేళ్లుగా అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యాడు. ఇన్నాళ్లు ఆయనకు సేవ చేస్తున్న ఆమె, మానసిక ఒత్తిడితో ఆదివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ఆమెకు భర్తతో పాటు ఇద్దరు కుమారులున్నారు. మృతురాలి తల్లి నాగేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.